# ౪ కాపవరపు చెరువులో కోరుకొండ నరసింహాస్వామి నీటినీడలు.

బాలలో వృద్ధులో అనే సామెత కర్థం బాలలవలె వృద్ధులు కూడా చపల స్వభావులని, అమాయకులని, లౌకిక దృష్టి తక్కువగానున్న వారలనా? లేక మఱొక్కటేమైనా అనా? అని యొక యుదయం యోజిస్తూ కూర్చున్నాను. వార్ధక్యం వచ్చినకొద్దీ కడచన్న బాల్యం దానికి దగ్గరగా కనిపిస్తూ ఉంటుందనీ, ఆ బాల్యమందు లీనమై ఆ చేష్ట లనే వృద్ధులగపిస్తూ వుంటారనీ తుదకు నా మనస్సులో తేలింది. ఏమా అంటే భూమ్మీద నుండి ఆకాశం దవ్వై కనిపిస్తూ ఉంటుందే కాని ఆ దవ్వైపోవడంలో ఆ ఆకాశం వాలిపోయి భూమి వంకకే దిఙ్మండలపు టంచునే విఱగబడిపోతూ వెఱగు గొలుపుతుంది. అదే మాదిరిగా మను జుల యొక్క బాల్యావస్థ అనేది, వారి యొక్క జీవితం పఱపై వార్ధక్య ప్రపూర్ణిమకు వచ్చినకొద్దీ దూరదూరంగా పోయిన ట్లనిపించినప్పటికీ ఆ వార్ధక్య మా బాల్యాన్ని తన యంచుల నందగింప జేసికొంటూనే వుంటుంది. బాల్యం ఆంతూ ఉంటుంది ఆ జీవితం యొక్క పరిపూర్ణపు టంచుల్ని అప్పుడా సమ్మేళనపు టవస్థ నగపించే కాలం యొక్క అంచునే చూడ దొఱకొన్నట్లాయినా, సూర్యోదయ సూర్యాస్తమానాలకు బొడసూపే శోభలటు వినోదపుటూహాలు విస్మృతి గొలుపుతూవుంటాయి. అటువంటి

విస్మృతి గొలిపే వినోదపు టూహల్లో ఒకటి నా జీవితంలో కోరుకొండ కొండ యొక్క తెలిమొన.

కైలాసగిరియొక్క చక్కందనమంతా పదనుదేఱి నింగి వైపు నిక్కి చొక్కియున్న ఫక్కి నాకన్నుల కతి రమణీయంగా కనిపిస్తూ, పొగమంచులో కప్పడినప్పు డోవిధమైన అవ్యక్తామృతమును చిలికిస్తూ, సూర్యుని మధ్యాహ్నదీప్తి కాంతుల్తో ధగద్ధగమంటూవున్నప్పు డోవిధమైన వ్యక్తి ద్యోతినొలికిస్తూ, వెన్నెల్లో తన్ను వెతుక్కోమన్నట్లు నన్ను కవ్వించే మవ్వ మదొక్కటే.

ఆ కొండమీదంత లక్ష్యం నా కుండడాని కో కారణముంది. మెట్లమ్మ టెక్కేవారి కా కారణం అగపించదు. మెట్లెక్కి చుట్టూవున్న ప్రహరీ గోడంచునే తిలకించినా కనిపించదు. పైనిగల గుడిగోడలమీది రామాయణాది కధనం యొక్క ముగుద చెక్కడాల్నిబట్టి బోధపడదు. లోనిగుడి చొఱబడి, ద్వారాని కిటూ అటూ సొసాయించే రెడ్ల ప్రభుల నిలువురాతి విగ్రహాల్ని గాని, గర్భగుడినున్న కూర్మ స్వరూపాన్నిగాని, సాక్షాత్కరింప జేసికొన్నా చేరికబడదు. ఆ కొండపైనే నంత లక్ష్య ముంచ గలిగినందులకు గల కారణమరసేవారలు నాతో రావాలి. కొండను కొండున్న చోటనే విడిచి పుచ్చాలి. కొండకు ఫరవాలేదు. కొండకు ఱెక్కలొచ్చి ఎగిరిపోయిం దేనాడో ! ఇప్పు డది సుస్థిరమ. నిత్య దృశ్యమ. దృశ్యా దృశ్యమై యందగించేది ఆ కొండయొక్క నీడ ; ఆ కొండయొక్క నీడ !

× ×

ఒక చక్కని చెఱువుంది. దాని పేరు కాపారపు చెరువు. కాపారమనేదో గ్రామం. కోరుకొండకు మిక్కిలి సమీపం. కాని చెరువుక్కాపారంకంటె కోరుకొండే చేరిక. ఏదైనాగాని చెరువుయొక్క చిరుకరళ్ళచే కోరుకొండగాని, కాపారంగాని తడియవు. దాని సొగసున నొఱిసి పొయ్యేది శ్రీరంగపట్టణం. దానిని శ్రీరంగ పట్టణపు చెరువనక కాపారపు చెరువని యెందుకోసం పిలుస్తారా అనేది నా కిప్పటికిన్నీ విడివడని సమస్యే.

చెరువుయొక్క పడమటిగట్టే నిలబడి చూతాం. పెద్దచెరువు ! అంతానీటిమయం ! రెండు కళింగళాల పొర్లు హోరెత్తుతూ ఒకటి పాండవుల పఱ్తియొక్క పడమటి దిగుభాగాన్ని, ఒకటి కారకోరంమెట్ట యొక్క ఉత్తర దిగుభాగాన్ని తెగ్గోస్తూ వుంటుంది. కాని చెరువుయొక్క నీటితలమాత్రం నిశ్చలం. నిమ్మకు నీరోసినట్టుంటుంది. తొలకరిలో కురిసే వానవరదకెఱ్ఱడౌలున ఉఱ్ఱూతలూగతూ వుంటుంది. కలువదుంపలు కమలాల దుంపలు లోలోపల్లటిల్లి పోతూవుంటాయి. బుఱ్ఱదోనెలు నిరాఘాటంగా నడాడుతూంటాయి. తూర్పు తట్టా చెఱువుకు గట్టులేదు. సూర్యభగవానుడా చెఱువు ముంపునం దుదయమౌతూ వున్నట్టెంచు కోవలసిందే కోరుకొండ కొండంటూ లేకపోతే. కోరుకొండ కొండుండడం బట్టి ఆ కొండ వెనకాలే తడిసిపోకుండా పొడిపొడిగా ఉదయిస్తున్నాడమ్మహాభాగుడు. అమ్మహాభాగుని సముజ్వలి తోదయాన్ని కొనియాడుడు! పూజించుడు ! కాని నే చెప్పదలచుకొన్న కారణమది కాదు.

ఆ కారణమది వేఱు. అదోజిగీష. దేనిని జయించ కోరిక అని అడుగుతారేమో? కోరుకొండ కొండయొక్క నీటి నీడ సంతనూ నావశం జేసికొని నిత్తెమూతరించి ఆ కొండను మెట్లులేని పక్కనుండి పైకెక్క

తచ్ఛిఖరాగ్రగంనుండి, నిర్మలమగునీరాన్నే సూర్యాస్తమయ కాంతులు కరగిపోవుట, తిలకిస్తూ ఒడలు పులకెత్త తియతియ భావాలను వివక్షణై "ఇదీ! కోరుకొండ కొండయొక్క నిజమైన దృష్టిపథము" అనే నిశ్చితానికివచ్చి "జయించాను! లోకాన్ని జయించాను" అనియుప్పొంగిపోయి నీరవుండనై అభినందించు కొంటూవుంటాను. ఇది తగిన కారణం కాదందురా? మానవు లందురేమోకాని దేవత లనరు. యక్ష కిన్నర కింపురుష గరుడ గంధర్వులు లేదనరు. కాదనువారైనచో వారు దాని పైని కోవెల్నిగట్టి ఆ కోవెల యొక్క గర్భగుడి ఆ వైపునకు ద్రిప్పియుందురా? త్రిప్పియుండరు.

× × ×

కథ కామాత్రం ఉపోద్ఘాతమంటూవుంటే కథ తనంతటే నడిచిపోతుం దామీద.

× × ×

ఆ చెరువుమీదను ఆ కొండయొక్కనీటి నీడల్లో తన తనువు యొక్క నీటినీడలు కలసిమెలసి పోయేటట్టుగా ఎల్లప్పుడూ, ఓ పల్లెవాడు, సంగడి తోసుకుంటూవుండే వాడొకడున్నాడు. వాని శరీరచ్ఛాయ—— వానియెత్తు——వానిపుష్టి——వాని పేరు——ఒక వెయ్యి తామరాకు కావిడేసుకుని రామవరపు దుర్గంనుంచి కోరుకొండ సంతకెగరేసుకుంటూ, ఏక బిగి నెగ రేసుకుంటూ పోయ్యేటంత!

వా డో రోజున దోనె తోస్తూన్నాడు. నేను దోనెమీద కూర్చొని లీలగా చూస్తూన్నాను నల్దెసలూ. చటక్క నో చేప మిలమిలామెఱసి

మా దోనెలోకి పడింది. నేను వెంటనే పల్లెవానితో "ఒరేవు! చేప పడింది. చేప పడింది. ఆలాచూస్తావేం? తీసికో" అన్నాను యదాలాపంగా. బ్రాహ్మణ చిన్నవాణ్ణయినా పల్లెవాని పామరత్వం ఆ నిమిషానికి ఆవరించి పలికించినట్లయి పోయింది. వాడు చేపను ముట్టలే. చేపను పట్టలే. దాన్నాలా కర్రతో మెటకరించి నీటిలో తిరిగి పడేసి దాన్ని విచ్చలవిడి యీదుకుపొయ్యేలాగు చేశాడు.

"ఏమిరా? నీ కులవృత్తి మఱచి పొయ్యేవు" అని అడిగాను. "బాబూ! ఈ చెర్లో నే నెప్పుడూ చేపలట్ట" నన్నాడు. "ఏ" మన్నాను. "ఈ చెర్లో చేపలట్టాలని ఒంగున్నప్పుడల్లా కోరుకొండ నరసింహస్వామి వారి ప్రతిబింబం చేపల్తో ఆటలాడుకుంటూ, పాటలుపాడుకుంటూ వున్నట్టు కనిపిస్తూ, స్వామివారిని వలేసి నిరోధిస్తే ఎంత పాపమో వాటిని పట్టుకున్నా అంత పాపమే అన్నట్టు అయిపోతుంది నా మనస్సు" అన్నాడు. "ఔరా." అని పైకని, లోలో ఊహించాను వాణ్ణిచూస్తూ వానికి తెలియకుండా ఇలా. "కాసంత యీనీట నీ నరసింహస్వామి యొక్క యీ నీడలే నిన్నింత పరవశుణ్ణిగా చేసి యీ నీ భుక్తికి ముఖ్యాధారమైన చేపల్ని పట్టకుండా చేసేటప్పట్లో, యీ మహాజగత్తంతా శ్రీ సర్వేశ్వర ప్రతిబింబమయం అని ప్రతిపాదించుకునే పురాణయోగులు తమకుదాము నిరాహారులు, పర్ణభక్షులు, వారిభక్షులు, వాయుభక్షులు, అయిపోవటంలో ఆశ్చర్య మేముంటుంది? వారికి సర్వభూతములందు సమరసభావం కుదరటమన్నా ఇంతే ఈనీ అనుభవతార్కాణమే" అని అనుకున్నాను.

ఆలా అనుకుంటూ వాడు తోసే దోనెకేసి చూస్తూ వున్నాను. ఆ దోనె ఆ నృసింహస్వామి వారిపైన నీటినీడల్నీ, నీటినీడల్నే మెఱసే

చేపల్ని కూడా తరించి నన్నావలిదరికి జేర్చింది; "అదిగో కొండ ! అలా తిన్నగా ఎక్కిపోతే స్వామివారి ద్వారం ఈ వైపునకే ఉంది, తిన్నగా స్వామివారిని సందర్శించుకో" అన్నట్టు.

దారికానైతే ఎగుడుదిగుడు. కాని అది నా సొంతదారి. నే చేసికొని పొయ్యేదారి అనే ఆనందం ఒకటి నాలో మెఱసింది. నే ననుకొన్న దృశ్యం నాకు నిబ్బరం గొలిపింది. నేను లోకమును జయించాను, కోరికలను జయించాను అని ఉప్పొంగి పోయాను.

| | | |
|---|---|---|
| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| 6.7-1931 | కోరుకొండకొండ | "సుధ"లో |